A1TV NEWS

నేటి ఆంధ్రప్రగతి

APTEL 2023/16425

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 85 శనివారం సెప్టెంబర్ 30- 2023 పేజీలు 4. వేల :4 /



# జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించిన సీఎం జగన్.

ఆంధ్ర ప్రగతి తాడేపల్లి సెప్టెంబర్ 29:
దేవునిదయతో మరో మంచి కార్యక్రమాన్ని ఇవాళ ప్రారంభిస్తున్నాం. ఈ కార్యక్రమంపై కలెక్టరేట్లు, డివిజన్ కార్యాలయాల్లో, సచివాలయాల్లో ఇప్పటికే ఓరియంటేషన్ ఇచ్చారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ స్థాయివరకూ కూడా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాముఖ్యత గురించి మీకు నాలుగు మాటలు చెపుతాను.

గతంలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమం లేదు. గొప్పగా చేయగలుగుతామనే విశ్వాసంతో దీన్ని ప్రారంభిస్తున్నాం.

ప్రివెంటివ్ కేర్‌లో ఇదొక నూతన అధ్యాయం. ఈ స్థాయిలో రాష్ట్రంలో, దేశంలో కూడా ఎవ్వరూ ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు చేయలేదు. మనం ధైర్యంగా, సాహసోపేతంగా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నాం. దీనికి కారణం క్షేత్రస్థాయిలో ఉన్న ప్రభుత్వానికున్న సిబ్బందే. ఇవాళ ప్రతి గ్రామంలోనూ 10,032 సచివాలయాల పరిధిలో మనం విలేజ్ క్లినిక్స్‌ను తీసుకువచ్చి.. నిర్వహణలో ఉంచగలిగాం. అదే విధంగా 542 అర్బన్ హెల్త్ సెంటర్లు కూడా వివిధ మున్సిపాల్టీలలో అందుబాటులోకి తీసుకునిరాగలిగాం. ఇందులో ఉండాల్సిన సిబ్బందిని నియమించాం.

# నారా లోకేష్‌కు స్వల్ప ఊరట.



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 29:
నారా లోకేష్ కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది అక్టోబర్ నాలుగు వరకు అరెస్ట్ చేయొద్దు అంటూ ఏపీ హైకోర్టు ఆదేశించింది. స్కిల్ ఫైబర్ నెట్ కేసులో లోకేష్ పిటిషన్ పై విచారణ వాయిదా పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో లోకేష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని హైకోర్టును ఆశ్రయించారు లోకేష్ తరఫు లాయర్లు. దీంతోపాటు ఫైబర్ నెట్ కేసులోను ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.. మరో వైపు.. నారా లోకేష్ ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్పోజ్ చేసింది.బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ఏపీ హైకోర్టు. విచారణకు సహకరించాలని లోకేష్‌కు కోర్టు ఆదేశించింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేష్‌కు 41%ూ% నోటీసులు ఇచ్చింది.. ఆ నోటీసులను ఇచ్చేందుకు ఢిల్లీ బయల్దేరింది ఏపీ సీఐడీ. లోకేష్‌ను విచారించేందుకు నోటీసులు ఇవ్వనున్నట్లుగా తెలిపింది సీఐడీ. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో %ూ%14 గా ఉన్నారు నారా లోకేష్.

# నారా భువనేశ్వరి బస్సు యాత్ర



ఆంధ్ర ప్రగతి రాజమండ్రి సెప్టెంబర్ 29:
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్మెంట్ కేసులో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. బెయిల్ కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలం కాగా, ఆయన న్యాయపోరాటం చేస్తున్నారు. ఏసీబీ కోర్టు, హైకోర్టులో చంద్రబాబుకు చుక్కెదురు కాగా, ప్రస్తుతం సుప్రీంకోర్టును ఆశ్రయించారు చంద్రబాబు.

అయితే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, కక్ష సాధింపు చర్యలో భాగంగా చంద్రబాబు అరెస్టు జరిగిందని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తున్నారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పార్టీ శ్రేణులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడానికి, చంద్రబాబు కోసం పోరాటాన్ని ముందుకు నడిపించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటికే చంద్రబాబు అరెస్ట్ గురించి, తన భర్త చంద్రబాబును తప్పుడు కేసులో ఇరికించారని, ఆయన ఎప్పుడూ ఏపీ ప్రజల సంక్షేమం కోసమే ఆలోచించారని ప్రజల్లోకి వచ్చి మాట్లాడుతున్న భువనేశ్వరి, తెలుగుదేశం పార్టీలో కీలకంగా భూమిక తీసుకునే అంశంపై ప్రస్తుతం టిడిపిలో చర్చ జరుగుతుంది. తెలుగుదేశం పార్టీ పొలిటికల్ యాక్షన్ కమిటీ ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో నారా భువనేశ్వరిని పొలిటికల్ గా యాక్టివ్ చేస్తే ప్రజలపై ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు.

భువనేశ్వరి రాజకీయంగా రంగంలోకి దిగితే వైసిపి విమర్శలు పెరుగుతాయని, వైసిపి నేతల మాటలను తట్టుకుని భువనేశ్వరి ముందుకు సాగుతారా అన్నది చర్చనీయాంశంగా మారింది. తెలుగింటి సాంప్రదాయ కుటుంబం నుండి వచ్చిన భువనేశ్వరి తనపై జరిగే వాటిని తట్టుకోగలుగుతారా? నిలబడగలుగుతారా ?అన్నది ఇప్పుడు పొలిటికల్ యాక్షన్ కమిటీ చర్చిస్తుంది.

భువనేశ్వరి తో వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేయిస్తే ప్రజలను చైతన్యవంతులను చేయడానికి, చంద్రబాబు కోసం ప్రజలు ఆలోచించేలా చేయడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. విజయమ్మ మాదిరిగానే భువనమ్మ కూడా రాజకీయాల్లో యాక్టివ్ అవుతారని ప్రస్తుతం చర్చ జరుగుతుంది. ఇప్పటికే వివిధ దశల్లో వివిధ ప్రాంతాలకు చెందిన నేతలతో ఆమె వరుసగా భేటీ అవుతున్నారు.

పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అలానే ఎప్పటికప్పుడు మీడియాతో మాట్లాడుతున్నారు. సోషల్ మీడియాకు వీడియోలు విడుదల చేస్తూ తన బాధ, ఆవేదన చెప్పుకుంటున్నారు. తాజాగా ఆమె మేలుకో తెలుగోడా పేరిట బస్ యాత్రకు సిద్ధం అవుతున్నారు అన్నది టాక్. భువనేశ్వరి బస్సుయాత్ర చేపడతారా? లేదా? అన్నది మరికొద్ది రోజుల్లో తెలియనుంది.

## అవనిగడ్డలో భారీ బహిరంగ సభతో పవన్ కల్యాణ్ వారాహి విజయయాత్ర ప్రారంభం

**వారాహి వాహనంపై నుంచి సభికులను ఉద్దేశించి ప్రసంగించనున్న పవన్**

**2న కృష్ణా జిల్లా జనసేన నాయకులతో సమావేశం**


**3న జనవాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ**



జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి విజయయాత్ర అవనిగడ్డలో బహిరంగ సభతో ప్రారంభం కానుందని ఆ పార్టీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 1న మధ్యాహ్నం మూడు గంటలకు అవనిగడ్డలోని శ్రీయక్కటి దివాకర్ వీణాదేవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో బహిరంగ సభ జరగనుందని తెలిపింది. వారాహి వాహనంపై నుంచి సభికులను ఉద్దేశించి పార్టీ అధ్యక్షుడు పవన్ ప్రసంగిస్తారు.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖ జిల్లాల్లో మూడు దశలుగా పూర్తయిన వారాహి విజయయాత్ర 4వ దశలో కృష్ణా జిల్లాలో ఐదు రోజుల పాటు సాగనుంది. బహిరంగ సభ అనంతరం మచిలీపట్నం చేరుకొని 2, 3 తేదీల్లో పవన్ కల్యాణ్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 2వ తేదీన కృష్ణా జిల్లా జనసేన నాయకులతో సమావేశమవుతారు. 3వ తేదీన జనవాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారు. 4న పెడన, 5న కైకలూరు నియోజకవర్గాల్లో పవన్ పర్యటిస్తారు

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

పార్లమెంట్‌లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేశారు. కొత్త పార్లమెంట్ భవనంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదముద్ర పడటంతో చట్టంగా రూపుదాల్చింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నూతన చట్టం ప్రకారం లోక్ సభతో పాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించవలసి ఉంటుంది.



గురువారం రోజు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఈ 128వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంతకం చేశారు. ఆ తర్వాత రాజ్యాంగంలోని 111వ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. నేడు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడంతో బిల్లు చట్టరూపం దాల్చింది. ఈ బిల్లుకు మజ్లిస్ పార్టీ మినహా అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి.

## చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ అక్టోబర్ 3కు వాయిదా

**సీఐడీ తరఫున వాదనలు వినిపించిన ఏజీ శ్రీరామ్**

**చంద్రబాబు తరఫున వాదనలు వినిపించిన సిద్ధార్థ లూథ్రా**

**ఇరువైపుల వాదనల అనంతరం వచ్చే నెలకు వాయిదా వేసిన న్యాయస్థానం**



అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. తొలుత సీఐడీ తరఫు న్యాయవాది ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించగా, ఆ తర్వాత చంద్రబాబు తరఫున సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను అక్టోబర్ 3వ తేదీకి వాయిదా వేసింది.రెండు రోజుల క్రితం సిద్ధార్థ లూథ్రా వర్చువల్‌గా ఢిల్లీ నుంచి వాదనలు వినిపించారు. అనంతరం సీఐడీ తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. చంద్రబాబు అక్రమాలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఆ తర్వాత సిద్ధార్థ లూథ్రా కౌంటర్ వాదనలు వినిపించారు. రాజకీయ దురుద్దేశంతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. ఆ తర్వాత తదుపరి వాదనలు కొనసాగించే క్రమంలో భాగంగా విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేశారు.

# వినూత్న నిరసనకు టిడిపి పిలుపు

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 29:
అధినేత మాజీ సీఎం చంద్రబాబు అక్రమ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెదేపా సెప్టెంబర్ 30న వినూత్న నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. చంద్రబాబుకు మద్దతుగా శనివారం రాత్రి 7గంటల నుంచి రాత్రి 7.05 గంటల వరకు ఐదు నిమిషాల పాటు ప్రజలంతా సీఎం జగన్‌కు వినిపించేలా ఏదో ఒక రకంగా మోత మోగించాలని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, నారా బ్రాహ్మణి విజ్ఞప్తి చేశారు. నియంత ముందు మొరపెట్టుకుంటే ఫలితం ఉండదని.. అధికార మత్తు వదిలేలా మోత మోగించాల్సిందేనంటూ ప్రత్యేక పోస్టర్‌ను పోస్ట్ చేశారు. ఐదు కోట్ల ఆంధ్రులంతా ఒక్కటిగా ఇంట్లోనో, ఆఫీస్‌లోనో ఇంకెక్కడ ఉన్నా సరే బయటకు వచ్చి గంట లేదా ప్లేట్ మీద గరిటెతో కొట్టాలని, రోడ్డుపై వాహనంతో ఉంటే పక్కకు ఆపి హారన్ మోగించాలని కోరారు. ఎవరు ఏ రూపంలో నిరసన తెలిపినా సంబంధిత వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "అక్రమ అరెస్టు చేస్తే ప్రజాగ్రహం ఎలా ఉంటుందో చూపిద్దాం. తప్పుడు కేసులు బనాయిస్తే వెనక్కి తగ్గమని నిరూపిద్దాం. నిలువెత్తు నిజాయితీ రూపం, తెలుగు తేజం చంద్రబాబుకు మద్దతుగా తెలుగు వారంతా ఉన్నారని నిరూపించే తరుణమిది. నిష్కళంక రాజకీయ మేరునగధీరుడు చంద్రబాబు నాయుడుకు మద్దతుగా 30వ తేదీ శనివారం రాత్రి 7 గంటల నుంచి 7.05 నిమిషాలకు ఉన్న చోటే మోత మోగించి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాశబ్దం వినిపిద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

–మీ నిశ్శబ్దాన్ని బ్రేక్ చేయండి: భువనేశ్వరి.

మరోవైపు ఇదే అంశంపై చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సైతం ట్వీట్ చేశారు. "చంద్రబాబు గారి మీద తప్పుడు కేసు పెట్టి, ఆయన అవినీతి చేశారని చెప్తే ప్రజలు నమ్మేస్తారని అనుకుంటున్నారు. మీ నిశ్శబ్దం వారి నమ్మకాన్ని నిజం చేస్తుంది. అందుకే ఆ నిశ్శబ్దాన్ని బ్రేక్ చేయండి. శబ్దం చేయండి. చంద్రబాబు పట్ల మీరు చేసింది తప్పు అని వాళ్ళకి చెప్పండి. చంద్రబాబుకు మద్దతుగా శనివారం రాత్రి 7 నుండి 7.05 గంటల వరకు 5 నిమిషాల పాటు వీధుల్లోకి వచ్చి గంటలు మోగించండి. లేదా ఒక పళ్లెం తీసుకుని గరిటెతో కొట్టండి. విజిల్ వేయండి. రోడ్డు ప్రయాణంలో ఉన్నా పరవాలేదు. వాహనం పక్కకు తీసుకుని హారన్ కొట్టండి. మొత్తమ్మీద ఏదో ఒక శబ్దం చేయండి." అని విజ్ఞప్తి చేశారు.

ప్రజలు మౌనంగా ఉంటే –అన్యాయం చెలరేగిపోతుంది: బ్రాహ్మణి.

"పాలకుల అక్రమాలకు అడ్డు చెప్పకపోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ముఖ్యంగా ప్రజలు మౌనంగా ఉంటే అన్యాయం చెలరేగిపోతుంది. అందుకే ఏపీ ప్రజలకు నా విజ్ఞప్తి! చంద్రబాబు గారి గురించి మీకు బాగా తెలుసు. ఆయన్ను అక్రమంగా నిర్బంధించడం తప్పు అని చెప్పండి. చంద్రబాబుకు మద్దతుగా సెప్టెంబర్ 30, రాత్రి 7 నుండి 7.05 గంటల వరకు 5 నిమిషాల పాటు వీధుల్లోకి వచ్చి గంటలు మోగించండి. లేదా ఒక పళ్లెం తీసుకుని గరిటెతో కొట్టండి. విజిల్ వేయండి. రోడ్డు ప్రయాణంలో ఉంటే హారన్ కొట్టండి. మొత్తమ్మీద ఏదో ఒక శబ్దం చేసి ప్రభుత్వానికి మీ నిరసన తెలియజేయండి" అని తెలుగు ప్రజలకు బ్రాహ్మణి విజ్ఞప్తి చేశారు

# మండల స్థాయి స్పందన దరఖాస్తులు వేగంగా పరిష్కరించండి.

**-మండల స్థాయి స్పందనకు 75 దరఖాస్తులు. -జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి.**

ఆంధ్రప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 29:
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వారంలో ప్రతి బుధ, శుక్రవారాలు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి స్పందనలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి స్పందనలో స్వీకరించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వారంలో ప్రతి బుధ, శుక్రవారాలు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి స్పందన కార్యక్రమంలో పాల్గొని పరిష్కరించదగ్గ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల స్థాయి స్పందనలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని వీటన్నింటిని నిర్ణీతకాల పరిమితిలోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జెసి వివరించారు.

నంద్యాల మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో 75 దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటిని బియాండ్ ఎస్ఎల్ఎ లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఇతర జిల్లా అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండల స్థాయి స్పందనలో కొన్ని వినతులు

1) చాగలమర్రి మండలం చిన్న బోధనం గ్రామ కాపురస్తురాలు రమణమ్మ తన అక్కకు నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో సర్వే నంబర్ 256 లో 1.40 సెంట్ల భూమి వుందని... ప్రస్తుతం



ఆమె చనిపోయిందని సంబంధిత భూమి హైవే రోడ్డుకు కేటాయించారని సంబంధిత పరిహారం మొత్తాన్ని మా బావగారికి చెందకుండా సివిల్ జడ్జి కోర్టులో డిపాజిట్ చేపించవలసినదిగా కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.

2) నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన తలారి ఎల్లమ్మ తన భర్త అనారోగ్యం కారణంగా చనిపోయారని.... రైస్ కార్డ్ నుండి ఆయన పేరును తొలగించి నా కుమార్తె ఆధార్ నంబర్ సరిచేసి నాకు పెన్షన్ అప్లై చేసుకొనుటకు సహకరించగలరని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు



# గిరిజన మహిళతో సహజీవనం చేస్తున్నోడే చంపేశాడు.

ఆంధ్ర ప్రగతి విజయవాడ సెప్టెంబర్ 29:
గుంటూరు జిల్లా లాలాపేట నల్లచెరువు కాలనీలో జూన్ నెలలో సహజీవనం చేస్తున్న వ్యక్తి చేతిలో గిరిజన మహిళ దారుణ హత్యకు గురైందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ ను కోరారు.శుక్రవారం విజయవాడ ఎస్టీ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ ను జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, గౌరవ అధ్యక్షుడు నేనావత్ శంకర్ నాయక్ లు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం ఎస్ ఎన్ తాండ వాసు భారతి బాయి (45) తన భర్తతో మనస్పర్ధల నేపథంతో కొన్నేళ్ల క్రితం గుంటూరు కు వచ్చి దాసరి పాలెంలో ఉంటూ మిర్చి యార్డు వద్ద మిరప తొడిమలు తీసుకుంటూ జీవనం సాగించేవారు. కొన్ని నెలల క్రితం నల్లచెరువు కాలనీలో మారారు మిర్చి యార్డులో ఓ వ్యక్తితో పరిచయమై అతనితోనే సహజనం చేస్తూ ఉండేది అయితే ఒకరోజు కొడుకు కూలి పనికి వెళ్లడంతో భారతి బాయ్ ని కత్తితో అతికిరాతకంగా హతమార్చి పరారయాడని విషయం తెలిపారు. దిక్కులేని స్థితిలో ఇద్దరు కుమారులు ఓ కుమార్తె అనాథల బ్రతుకుతున్నారని వారిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకొని ఇంటికో ఉద్యోగం, ఇంటి స్థలం, ఐదు ఎకరాల భూమి కేటాయించి గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ ను కోరారు.ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబాన్ని న్యాయం చేస్తా.... రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ గుంటూరు నగరంలో హత్యకు గురైన గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబాన్ని న్యాయం చేస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. ఈ విషయంపై గుంటూరు జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ అన్ని వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తో పాటు జిపిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నేనావత్ శంకర్ నాయక్ గుంటూరు జిల్లా జిపిఎస్ అధ్యక్షుడు హనుమంతు నాయక్, కే రామంజి, నంద్యాల జిల్లా జాయింట్ సెక్రెటరీ రామచంద్రనాయక్, రాము నాయక్, తిరుపాలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# లాయర్ పై పెట్టిన అక్రమ కేసును ఎత్తి వేయాలని డిమాండ్ చేసిన బార్ అసోసియేషన్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:
నంద్యాల బార్ అసోసియేషన్ లాయర్ అశోక్ నాయక్ పై పోలీసులు కేసును నమోదు చేశారు. లాయర్ అశోక్ నాయక్ పై పెట్టిన తప్పుడు కేసును ఎత్తి వెయ్యాలని లాయర్ల డిమాండ్ చేశారు. నంద్యాల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఒక గిరిజనుడు ఉన్నంత చదువు చదివి ఒక లాయర్ గా ఉంటూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ మ్యాటరింగ్ కమిటీ మెంబర్గా ఉన్న అశోక్ నాయక్ పై ఇలాంటి కేసులు పెట్టడం వల్ల గిరిజనులకు భయభ్రాంతులకు గురవుతారని నిరంతరం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీల ఛాంబర్ లో కూర్చొని ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేయవలసిన వారిపైనే కేసులు పెడితే మిగతా వారి పరిస్థితి ఏంటని మిగతా గిరిజనులు భయాందోళనకు గురి అవుతారని కావున జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ స్పందించి వాస్తవాలను వెలుగులో తీసుకురావాలని అశోక్ నాయక్ పై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే కొట్టివేయాలని ఆయన డిమాండ్ చేశారు అశోక్ నాయక్ వెంట నంద్యాల బార్ అసోసియేషన్ ఉంటుందని ఆయన అన్నారు వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారికి న్యాయం చేకూర్చాలంటే ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్లతోనే సాధ్యమని వృత్తిపరంగా లాయర్. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ గా కొనసాగుతున్న అశోక్ నాయక్ పైఇ లాంటి వారిపైనే కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు .బేతంచెర్ల మండలం బుగ్గాని పల్లె తండాలో తన సొంత పొలంలో ఏ ఎం ఎంఎస్ గ్రీన్ ఎనర్జీ కంపెనీకి చెందినవారు అక్రమంగా హై వోల్టేజ్ కలిగిన కరెంటు స్తంభాల నిర్మాణ పనులను చేపడుతున్న వారిని అడ్డుకున్నందుకు తన పై పోలీసులు కేసు నమోదు చేశారంటున్నారు. మేము ఈ పొలంలో సంవత్సరానికి మూడు పంటలు పండించుకుని బ్రతుకుతున్నామని, కంపెనీ వారికి అసలు మా పొలాలలో కరెంటు స్తంభాలు వేసే అధికారం ఎవరిచ్చారని కంపెనీవారిని ప్రశ్నించామని తెలిపారు. మా పొలాలు మేము ఎవ్వరికీ ఇవ్వలేదని అయినా మా పొలాలలో కరెంటు స్తంభాలు ఎందుకు వేస్తున్నారని అడిగామన్నారు. కంపెనీ వారితో మాట్లాడ్డానికి వెళితే మాకు డబ్బులు ఇచ్చి బలోపేతానికి గురి చేయాలనుకున్నారు కానీ మేము ఎటువంటి బలోపేతాలకు లొంగలేదన్నారు. పోలీసులు ఏమి విచారించకుండా అశోక్ నాయక్ పై పెట్టిన తప్పుడు కేసును ఎత్తివేయాలని,కేసు ను తీసేసే వరకు బాదితుడికి అండగా ఉంటామని బార్ అసోసియేషన్ న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లాయర్లబార్ అసోసియేషన్ సభ్యులు ప్రసాద్ రెడ్డి తోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో బాల అకాడమీ పాఠశాల విద్యార్థుల ఘనవిజయం.




ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:
స్థానిక నంద్యాల జిల్లాలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలోని విద్యార్థులు ఈ నెల 26 వ తేదీన పర్యాటకపర్యాటక దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలను నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో బాల అకాడమీ పాఠశాల విద్యార్థిని యస్.రంషియా (10వ తరగతి) ప్రథమ బహుమతి, సర్టిఫికేట్ అలాగే సి.తేజస్వినీ (6వ తరగతి) విద్యార్థిని ప్రోత్సాహక బహుమతులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సెప్టెంబర్ 29 శుక్రవారం అందుకోవడం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ యం. జి. వి. రవీంద్రనాథ్ సార్ మరియు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత విజయం సాదించిన తమ విద్యార్థులకు ప్రత్యేకమైన అభినందనలను తెలియజేశారు.

# వి ఏ ఓ ల ధర్నాను జయప్రదం చేయండి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:
అక్టోబర్ 10, 11వ తేదీల్లో వి వో ఏ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఆఫీస్ ముందు దు ధర్నా జయప్రదం చేయండి.
వి వో ఏ లో మూడు సంవత్సరాల కాలపరిమితి సర్కిలర్లు రద్దు చేయాలని హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్ని రకాల బకాయిలు చెల్లించాలని కోరుతూ అక్టోబర్ 10, 11వ తేదీల్లో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో జిల్లాలోని అన్ని మండలాల్లో వి వో ఏ లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే, ధనలక్ష్మి పిలుపునిచ్చారు ఈరోజు నంద్యాల పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో వి వో ఏల సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు కె,సోమన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె, ధనలక్ష్మి ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం వివోఏ ల సంఘం జిల్లా కార్యదర్శి ఏ,తిరుపతయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కాల పరిమితి సర్కిల్ రద్దు చేయాలని హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని, లోకో యూప్ వర్క్ కోసం ఫైవ్ జి మొబైల్ ప్రభుత్వం ఇవ్వాలని, వాలంటరీ ఐడి తో వి వో ఏ తో పని, చేయించరాదని వి వో ఏ ఐడి ద్వారా పనిచేయించాలని 15 సంఘాల లోపు ఉన్న వివో ఏ లకు వేతనాలు చెల్లించాలని, మెర్జ్ వల్ల ఉపాధి కోల్పోయిన వివోఏ లకు నష్టపరిహారం చెల్లించాలని, కోరుతూ కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాకు వివోఏలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు ఈ జిల్లా కమిటీ సమావేశంలో వి



వో ఏల సంఘం జిల్లా నాయకులు వెంకటరమణ భాస్కర్ శిరోమణి శ్రీను శంకరయ్య అలిపిర తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వి వో ఎ లా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# వైస్ చైర్మన్ మాట్లాడిన తీరు సరైంది కాదు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29: నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ పంపవలి మాట్లాడిన తీరు సరైంది కాదు. వైసీపీకి నిజాయితీ ఉంటే పశువులనుకొన్నట్లు కొన్న వార్డుల్లో ఉప ఎన్నికలు జరిపించాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు వార్డు సమస్యలను పరిష్కారం చర్చించాలి తప్ప ఈ విధంగా మాట్లాడడం సరైనది కాదు. అధికార అహంకారమా డబ్బులు ఉన్నవని అహంకారమా బెదిరింపులతో లొంగదీసుకున్నావని, అహంకారమా వేటి వలన మీరు అవార్డులో నిలబడిన అభ్యర్థులను పశువులకు కొన్నట్లు తెలిపారు. అదే నిజమైతే పాంషావలి ఉపన్యాసాన్ని ఎన్నికల అధికారులు కోర్టులు చట్టం ప్రకారము ఎన్నికలు జరిపించాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి డిమాండ్ చేస్తూ, ప్రజలకు రక్షణ కల్పించలేని పరిస్థితులలో లొంగిపోయిన వారు కూడా ఉంటారు వాటిని దృష్టిలో పెట్టుకొని అన్ని వార్డులలో ఉన్న ప్రజలను కూడా ఓట్లకు డబ్బులు ఇచ్చి పశువులనుకున్నట్లే కదా మీ లెక్కలో ఇదే ప్రచారం చేస్తే మీ ప్రభుత్వానికి మీరు చెప్పిన ఎమ్మెల్యేకు ప్రభుత్వానికి ఓటమి తప్పదని తెలియజేస్తున్నాను. ఓటర్లు కూడా పాంసావలి మాటలను దృష్టిలో పెట్టుకొని పశువుల మాదిరి కొన్న వారికి తగిన గుణపాఠం నేర్పడానికి కృషి చేయాలని కోరుతున్నాను.

# జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ.



ఆంధ్ర ప్రగతి చాగలమర్రి సెప్టెంబర్ 29:
భారతదేశ ఆధునిక సామాజిక సంఘ సంస్కర్తలు, బహుజనుల ఆరాధ్య దైవం అయిన జ్యోతిబాపూలే సావిత్రిబాయిపూలే ల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నంద్యాల జిల్లా చాగలమర్రి నందు గల కస్తూరిబా బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షురాలు ముడియం సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్వర్ హుస్సేన్ ,సాయి,మహిళా ఐక్య వేదిక రాయలసీమ అధ్యక్షురాలు భారతమ్మ పాల్గొన్నారు. అనంతరం ఎంఈఓ అనురాధ,స్కూల్ ప్రిన్సిపాల్ సునీత మేడం మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి లు మాట్లాడుతూ విద్యార్థులు సావిత్రిబాయిపూలే జ్యోతిబాపూలే ల అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని వారు తెలిపారు. చదువుల తల్లి సావిత్రిబాయిపూలే జయంతి రోజును ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆధునిక భారతదేశంలోనే మొట్ట మొదటి సామాజిక ఉద్యమకారులు మహాత్మా జ్యోతిరావుపూలే అని, మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తన భార్య ను ఉపాధ్యాయురాలు గా తీర్చిన ఘనత పూలేదేనని వారు కొనియాడారు. జ్యోతిభాపూలే ని గురువులుగా ప్రకటించుకొని డా: బి.అర్. అంబేద్కర్ విద్యకు సంబంధించిన హక్కులు, రిజర్వేషన్లు, మరియు మహిళల హక్కులు అన్నీ కూడా రాజ్యాంగంలో పొందుపరిచారని తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా జరపాలని, అదే విధంగా సావిత్రిబాయి పూలే జయంతి రోజు జనవరి 3 వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదవాలని పిలువు నిచ్చారు. నాడు వారు ఏ యే సమస్యలపై పోరాడారో నేడు అవే సమస్యలు కొత్త రూపంలో వస్తున్నాయని వాటన్నింటిపై చదువుతూ పోరాడాలని ఆమె పిలుపు నిచ్చారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుని ఆ స్ఫూర్తితో ప్రతి బహుజన బిడ్డ మరియు విద్యార్థులు ముందుకు వెళ్లాలని ఆమె సూచించారు.

# రూ 2000 నోటు మార్పిడికి నేడే చివరి రోజు.

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 29: బ్లాక్ మని నిరోధించడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. 2016లో పాత రూ500, రూ1000 రూపాయల నోట్లోనూ రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే వాటి స్థానంలో కొత్త రూ500,రూ2000 నోటును తీసుకొచ్చింది. అయితే కొత్త రూ.2000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ఈ ఏడాది మేలో ప్రకటించింది.
వీటిని బ్యాంకు అకౌంట్లలో డిపాజిట్ చేసుకోవాలని లేదంటే ఏదైనా బ్యాంకుల్లో మార్చుకోవాలని సూచించింది. ఇందుకు సెప్టెంబర్ 30 వరకు గడువు విధించిన సంగతి తెలిసిందే. ఈ గడువు రేపటితో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో రూ.2000 నోట్ల ఉపసంహరణకు సంబంధించిన కీలక అంశాలను పరిశీలిద్దాం.
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటన ప్రకారం, ప్రజలు సెప్టెంబర్ 30 వరకు రూ.2000 నోట్లను బ్యాంకుల్లో మార్చుకోవచ్చు. లేదా డిపాజిట్ చేసుకోవచ్చు. రూ.2000 నోట్లను ఎక్స్ఛేంజ్‌లో భాగంగా ఇతర డినామినేషన్ నోట్లను తీసుకోవచ్చు. అయితే అందుకు రూ.20,000 పరిమితి విధించారు.
రూ. 2,000 నోట్ల మార్పిడి సదుపాయం పూర్తి ఉచితంగా పొందవచ్చు. ఇందుకు బ్యాంకులు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయవు. బ్యాంకు ఖాతాల్లో రూ.2000 నోట్లు డిపాజిట్ చేయడానికి ఎలాంటి పరిమితులు లేవు. అయితే ఇది ప్రస్తుత నో యువర్ కస్టమర్ నిబంధనలు, ఇతర వర్తించే చట్టబద్ధమైన, నియంత్రణ అవసరాలకు అనుగుణంగా ఉండాలి.బ్యాంక్ అకౌంట్ లేని వ్యక్తి కూడా ఏదైనా బ్యాంక్ బ్రాంచ్‌లో ఒకేసారి రూ. 2,000 నోట్లను రూ. 20,000 పరిమితి వరకు మార్చుకోవచ్చు. ఇష్యూ డిపార్ట్‌మెంట్స్ ఉన్న ఆర్బీఐ 19 ప్రాంతీయ కార్యాలయాల్లో సైతం రూ.2,000 నోట్లను ఒకేసారి రూ. 20,000 పరిమితి వరకు మార్చుకునే సదుపాయం ఉంది. బ్యాంకుల నుంచి అందిన డేటా ప్రకారం.. ఆగస్టు 31 నాటికి చలామణి నుంచి తిరిగి వచ్చిన రూ.2000 నోట్ల మొత్తం విలువ రూ.3.32 లక్షల కోట్లు.
ఆగస్టు 31 నాటికి చలామణిలో ఉన్న రూ.2000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లు. ఈ ఏడాది మే 19 నాటికి చలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 93% బ్యాంకులకు తిరిగి చేరాయి.
ప్రధాన బ్యాంకుల నుంచి సేకరించిన డేటా ప్రకారం.. రూ.2000 డినామినేషన్‌లోని మొత్తం నోట్లలో సుమారు 87% డిపాజిట్ల రూపంలో, మిగిలిన 13% ఇతర డినామినేషన్ నోట్లలోకి ఎక్స్ఛేంజ్ అయ్యాయి. కాగా, ప్రస్తుతానికి తుది గడువు పొడిగింపుపై ఆర్బీఐ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి రూ. 2,000 నోట్లు ఉన్న వ్యక్తులు వీలైనంత త్వరగా వాటిని మార్చుకోవడం మంచిది.
రూ.2000 నోట్ల ఉపసంహరణతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధానంగా ఆర్థిక వ్యవస్థలో నల్లధనం ప్రభావం తగ్గుతుంది. ఇక నకిలీ రూ.2 వేల నోట్ల బెడద ఉండదు. రూ.500 నోట్ల లావాదేవీలు భారీగా పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా డిజిటల్ లావాదేవీలు మరింత పెరగొచ్చనే అంచనాలు ఉన్నాయి. 2026 కల్లా ఇది మూడు రెట్లు పెరగొచ్చని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.





# భూమా ఆధ్వర్యంలో 17 రోజుకు చేరుకున్న నిరసన దీక్షలు.

## దీక్షలకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి ఎన్ ఎమ్ డి ఫారూఖ్ .

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:
మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా 17 వ రోజుకు రిలే నిరాహారదీక్షలుచేరుకున్నాయి. ఈ నిరాహార దీక్షలను మండల కన్వీనర్లుగురునాథ్ రెడ్డి,చంద్ర శేఖర్ రెడ్డి,18 వార్డ్ తోటరామయ్య,గుద్దేటి వెంకటేస్వర్లు,చలపతి ప్రారంభించడం జరిగింది.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బాబుతో నేను బాబు కి తోడుగా ఒక నియంత పై పోరాటం కోసం మేము సైతం అంటూ పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం నందు 17 వ రోజు ధీక్షలో నంద్యాల పట్టణ లోని 12 వార్డ్,15 వార్డ్,19 వార్డ్,24 వార్డ్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 17 వ రోజురిలే నిరాహార దీక్ష కార్యక్రమనికి సంగిభావం తెలిపిన మాజీ మంత్రివర్యులు ఎన్ ఎండి ఫరూక్. అనంతరం దీక్షలో కూర్చున్న నాయకులకి కౌన్సిలర్ మహబూబ్ వలి,పెద్దకొట్టాల కొండా రెడ్డి,వి.విశ్వేశ్వర రెడ్డి,వంగల మోహన్ రెడ్డి,గుల్లి బాషా నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో 12 వార్డ్ గాలి చంద్రశేఖర్,15 వార్డ్ యూబ్బైజర్,వేణు గోపాల్,వికాస్ స్కూల్ వలి,నాగేశ్వర రావు,19 వార్డ్ కమల్ బాషా,ఖాదర్,షైక్ మౌళి,కత్తి మద్దిలేటి,మధు24 వార్డ్ చలపతి,అరవిటి రవి కుమార్,శ్రీనివాసులు,సునీల్,భారతి,హరి,పలుకురి శ్రీనివాసులు,తిరుపాలు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్బంధ కాండను ఆపాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:
వామపక్ష ఉద్యమాల పట్ల పోలీసుల నిర్బంధ కాండను ఆపాలని, గృహనిర్బంధాలు ముందస్తు అరెస్టులు విరమించుకోవాలని నంద్యాల జిల్లా %ట్రా% గారికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు గారు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఎం జిల్లా నాయకులు నాగరాజుతదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన సిఐ సూర్య మౌళి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:
స్వస్థలం శ్రీకాకుళం జిల్లా,ఈయన 2009 లో ఎస్ ఐ హోదాలో పోలీస్ శాఖలో చేరారు .ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల 3 టౌన్ నందు ప్రొబేషనరీ ఎస్సై గా పనిచేశారు. అనంతరం కర్నూలు జిల్లా నందవరం, మహానంది, నంద్యాల త్రీ టౌన్ , నంద్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ , శిరివెళ్ళ నందు ఎస్సైగా పని చేశారు. పనిచేసిన ప్రతి పోలీస్ స్టేషన్ నందు ప్రజల నుండి ఉన్నతాధికారుల నుంచి మంచి పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నారు. సాధారణ పదోన్నతులలో భాగంగా ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది.తర్వాత నంద్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ %××% కు ఇన్స్పెక్టర్ గా నేడు బాధ్యతలు స్వీకరించారు.అనంతరం నంద్యాల జిల్లా ఎస్పీ ని పోలీస్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.




# మహానంద్వీశ్వరుని హుండీ ఆదాయం రూ33,43 లక్షలు.

ఆంధ్ర ప్రగతి మహానంది ,సెప్టెంబర్ 29:
మహానంది క్షేత్రంలో శనివారం హుండీ లెక్కింపు నిర్వహించగా దేవస్థానానికి రూ.33,43,697 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రధాన ఆలయాల్లో భక్తులు 40 రోజులపాటు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ ప్రాంగణంలోని అభిషేక మండపంలో సిబ్బందితో లెక్కించామన్నారు. ఇందులో స్వామి, అమ్మవారి ఆలయాలలోని హుండీలతోపాటు ఇతర హుండీలను లెక్కింపు నిర్వహించగా రూ.33,43,697 లక్షలు వచ్చిందని అన్నారు.ఆలయాల ద్వారా 32,47,659వేలు,అన్నదానం హుండీ ద్వారా రూ.77,254 వేలు,గోసంరక్షణ రూ.18,784 వేలు,జర్మనీ కరెన్సీ 5 యూరో -1,యూఏఐ సెంట్రల్ బ్యాంక్ 5 దిరమ్స్-1,వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖా తరుపున టి .చక్ర భారత్, ధర్మకర్త మండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున, పి వీరభద్రుడు, వివిధ సేవా సంస్థల సభ్యులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

